# పూర్ణిమ - అమావాస్య

చలపతి రామచంద్రపురమున సోమవారము ప్రొద్దున్న తహసీలుదారీకి సంబంధించిన వ్యవహారమంతయు స్వవశము చేసికొని భోజనానంతరము సరిగా పదిగంటలకు కచేరీలో ధర్మాసనము నధిష్ఠించెను. శిరద్దారు, షరాబు, రెవెన్యూ యినస్పెక్టరులు, గుమాస్తాలు, జమీదారు, దలాయతులు అందఱును వచ్చి పరివేష్ఠించి యుండిరి. చలపతి మహానంద భరితుడై అందఱితోడను ఉల్లాసముగా మాట్లాడుచుండెను. ఆతని ప్రతిమాటయు న్యాయ విచక్షణతకు ప్రోద్బలకములై యుండెను. వానిని విని యిదివర కిట్టి అధికారుల ననేకులను జూచి యున్న శిరద్దారు మున్నగా సంస్కృత చిత్తులు "ఇవి ప్రారంభ లక్షణములు" అని యనుకొనుచుండిరి.

పదునొక్కండు గంటలైనవి. పోస్టు జవాను మీరాసాహేబు వచ్చి వంగి సలాము చేసి తంతి యిచ్చి వెడలిపోయెను. విప్పి చూడగా "ప్రొద్దున్న యెనిమిది గంటలకు నీకు కూతురు పుట్టింది" అని యందుండెను. తంతి యిచ్చినవాడు బావమరిది. విని అందఱు నానందించిరి. చలపతి మహానంద భరితుడయ్యెను. ఆతడు ప్రొద్దున్న రాజముద్రిక గైకొనుటయు, అక్కడ కూతురు పుట్టుటయు నొక్క సమయము నందే అయ్యెను. ఇదియే యాతని మహోల్లాసమునకు హేతువు.

ఇనాము ఇచ్చుటకు రూపాయ తీసి చూడగా మీరాసాహేబు లేడు. జమీదారు ఆ సంగతి చెప్పగా ఒక దలాయతు "పిలుచుకు వస్తాన"ని వెళ్ళబోయెను; గాని "వద్దు. నువ్వు వాడికియ్యి యీ రూపాయ" అని చలపతి జమీదారున కిచ్చెను. ఆ యౌదార్యమున కందఱును ఆశ్చర్యపడుచుండగా నాతడు "మధ్యాహ్నము మీరెవరూ ఫలహారానికి యెక్కడికీ వెళ్ళవద్దు. ఇక్కడ మనం అంతా కలిసి చేద్దాము" అని చెప్పెను. అందఱును బళా యనిరి. ఆతని యనుజ్ఞ చొప్పున ఒక గుమాస్తా అంతయు సిద్ధము చేయుటకు పూనుకొనియెను.

మూడు గంటల వేళ తాలూకా కచేరీ హాలు యిందున కనుగుణముగ సవరింపబడి అతిథులతో క్రిక్కిరిసి పోయెను. మేజస్ట్రీటు, డాక్టరు, కోర్టు మునసబు, పోస్టు మాస్టరు, పోలీసు ఇనస్పెక్టరులు, తాలూకా బోర్డు అధ్యక్షుడు, ప్లీడరులు, గ్రామమునందలి పెద్దమనుష్యులు కొందఱు, ఆయా కచేరీలకు సంబంధించిన ఉద్యోగులు, నౌకరులు - అందఱును అచ్చట నుండిరి. సరిగా మూడున్నర యగునప్పటికి శేషగిరిరావు వచ్చి విలువగల ఫలహారములను అమర్చెను. ఫలహారముల కమ్మని పరిమళములు, అగరు వత్తుల సురభిళ ధూమము, పూలగుత్తుల యొక్కయు, కర్పూరపుటుండల యొక్కయు, సువాసన, అత్తరువుల

గుబాళింపు, మందహాసముల యొక్క శోభాయమగు ఆమోదము - అన్నియు, కలిసి ఆనందసాగరము నుచ్చలితము గావించుచుండెను.

చలపతి లేచి యథోచితముగ ముచ్చటించి కోరిన పిదప అందఱును రసాస్వాదనము ప్రారంభించిరి. ఏర్పాటు చొప్పున శేషగిరిరావు అద్వితీయములగు మధురపదార్థముల తోడను, గంధర్వ ఫార్మసీ వారి పీయూషము తోడను, అతిథులను తృప్తులను గావించెను. ఫలహారానంతరము నలుగురైదుగురు విద్యార్థులు తాంబూలములు పంచిపెట్టిరి. చలపతి అతిథులకును, విందునకు ఘనత గూర్చిన శేషగిరిరావునకును తన కృతజ్ఞత తెలిపెను. అతని యున్నతోద్యోగము ఈ తీరున జాతీయాచారముతో ప్రారంభమయ్యెను. అందఱును అతని యౌదార్యమును కానందించుచుండగా చలపతి తనకు ప్రథమ సంతానము కలిగిన సమయము మంచిదని యుప్పొంగెను.

## ②

పదకొండవ రోజున చలపతి రాజమహేంద్రవరము వెళ్ళి బిడ్డకు బారసాల చేసి సుభద్రమ్మయని పేరుపెట్టి క్రొత్తగా మాతృత్వమును బడసిన యిల్లాలిని ఆదరించి బిడ్డ నెత్తుకొని ముద్దాడి ఆనంద పూర్ణుడై వచ్చెను. ఆయుత్సవమునకు గూడ ఆతడు కొందఱు గుమాస్తాలను వెంటబెట్టుకొని వెళ్ళెను.

మూడవమాసము చివర భాగమున బాపనమ్మ సుభద్రను తీసికొని రామచంద్రపురము వచ్చెను. వంట యైనను బిడ్డ రాకకు నిరీక్షించుచున్న చలపతి వీధి గుమ్మములోని కెదురువెళ్ళి బాపనమ్మ అందీయగా సుభద్రను పుచ్చుకొని ముద్దాడి తల్లి చేతికిచ్చెను. అందఱును ఆనందించిరి.

ఇంట నానందము. కచేరీలో గాంభీర్యము. ఎవరును అతని నోటినుండి పరుషవచనమును వినలేదు. కాఠిన్యమును చూడలేదు. స్పర్థను కనుగొనలేదు. సాధ్యమైనంత వఱకును అందఱకును ఉపకారమే. అతని నందఱును ప్రేమించిరి. తాలూకా ప్రజలందఱును "ఇలాంటి అధికారి యింతవరకు రాలేదు." అని చెప్పుకొన దొడగిరి. అందఱును ఆనందింప సాగిరి. అంతేకాదు. అసూయాపరులకు దహనముగూడ ప్రారంభమయ్యెను.

"సుభద్ర పుట్టిన సమయం మంచిది సుమా. పదవి హెచ్చింది. గౌరవం అధిక మయింది. సంపత్తు కలిగింది. జీవితానికి ఆనందమయత సంఘటిల్లింది" అని చలపతి బాపనమ్మతో అనేక పర్యాయములు చెప్పెను. అంతియుగాక తఱచు దినమున కొకమాఱయిన అట్లు చెప్పుచుండెను. అందులకు బాపనమ్మయు ఆనందించుచుండెను; గాని భర్త అంత మాత్రమే పలికి యూరకుండుట జూచి అతృప్త యగుచుండెను. ఇట్లు కొన్ని మాసములు గడసెను. ఆతడా యతృప్తి నారసి నిర్విణ్ణుడగుచు దానికి కారణమును వెదక బూనెను: గాని దొరకలేదు.

ఈయన్వేషణమున మరికొన్న మాసములు గడసెను. కౌమార్తను ప్రశంసించి భర్త వెంటనే ఆలోచనా పరుడగుట జూచి బాపనమ్మ గూడ కారణము నెఱుంగ జాలక చకిత కాసాగెను. ఇది ప్రారంభమయిన తరువాత గూడ కొన్ని మాసములు గడచిపోయెను. అనగా అప్పటికి సుభద్రకు సంవత్సరము గడచెను. సుభద్రకు డోలారోహణము, అన్నప్రాశనము మున్నగు సామయికోత్సవములు యథావిధిగా జరుగుచుండెను. సుభద్రకు వయసుతో రంజకత గూడ హెచ్చుచుండెను.

జమాబందీకి కలెక్టరు వచ్చి చలపతి సామర్థ్యమును పొగడి వెళ్ళెను. ఈ సంగతి యింటికి వచ్చిన వెంటనే యాతడు యథాపూర్వముగ "సుభద్ర పుట్టిన సమయము మంచిది సుమా. పదవి హెచ్చింది. గౌరవం అధిక మయింది. సంపత్తు కలిగింది. అధికార్ల మెప్పు కలిగింది. జీవితానికి ఆనందమయత సంఘటిల్లింది" అని భార్యతో చెప్పి మఱల యథాపూర్వ స్థితి సంభవింపగా "నువ్వు గనక యిలాంటి బిడ్డను కన్నావు" అనియెను. దీనితో బాపనమ్మ అతృప్తి తొలగిపోయినది. ఆనంద ముత్తరంగిత మయినది. ముఖము వికసంచినది. నయనములు లజ్జాముద్రితములు కాగా బాహువులు చలపతి కంఠమును పెనగొనినవి.

చలపతి చకితుడయ్యెను. "ఇదీ కారణం కనిపెట్టలేక పోయాను" అని యాతడు ఆశ్చర్యపడి ఆమె శిరమున మధుర చుంబనముల నుంచెను. ఇరువుర మనస్సులును నిర్మలములై నిస్సీమానందపూర్ణము లయినవి. ఈ యానందమునకు ఫలముగా సుభద్రకు ప్రేమ ప్రదర్శన మధిక మయ్యెను.

## 3

చలపతి బాపనమ్మ గాంభీర్యమున కాశ్చర్య పడెను. "ఆడాళ్ళ హృదయాన్ని తెలిసికొనే ప్రయత్నంలో మొగాడు ఇప్పటికీ, యెప్పటికీ గూడా సాధకుడే. సృష్టి గతించిన తరవాత గూడా ఈ సాధనకి అంతు వుండదు." అని భావించి ఆ తన్మయత వలన నాతడు నాడు కచేరీకి వెళ్ళుట అరగంట యాలస్యము చేసెను.

సుభద్ర కయిదవ యేడు వచ్చినది. అప్పటికి ఆతడు అమలాపురమున నుండెను. ఈలోపున ఆతని కనేక స్థలములకు బదలాయింపులు జరిగెను. అంతటను ప్రజాదరము లభించెను. అంతటను తృప్తి యొదవినది.

నిజముగా సుభద్రకు జరుగు గారము మహారాజు కూతురునకు గూడ జరుగదు. ఈ యేక సంతానము నెడల తల్లిదండ్రుల స్వార్థత్యాగము అసమానమై యుండెను. ఆ దంపతుల శుభచింతనము ఫలించినదో యన ఆబాలికకు అన్ని విషయములందును విజయమే లభించుచుండెను.

రెండవ తరగతి ముగియు వరకును ఉపాధ్యాయురాలు ఇంటికి వచ్చియే సుభద్రకు చదువు చెప్పెను. ఇంతలో చలపతికి రాజమహేంద్రవరమునకు బదిలీ

యయ్యెను. అక్కడ సుభద్ర బడిలో ప్రవేశించెను. ఆమె నాల్గవ తరగతి చదువుచుండగా ఆతనికి మరల రామచంద్రపురమునకు బదిలీ అయ్యెను.

అక్కడ రెండేండ్లు గడచినవి. సుభద్ర పాఠశాల విడిచి గృహమునందే జ్ఞానార్జనము చేయదొడగెను. అప్పటి కామెకు పదవ యేడు గడచెను. యెదుటి యింటి వారికి- పిల్లవానికి పెళ్ళి సంబంధములు రాగా బాపనమ్మ చలపతికి సుభద్ర వివాహము మాట చెప్పెను.

బంధువులు, స్నేహితులు, ఆశ్రితులు, పురోహితుడు, కచేరీ యందలి గుమాస్తాలు - అనేకులు వరాన్వేషణము ప్రారంభించిరి. కొందఱు ఆస్తికి ప్రాధాన్య మిచ్చిరి. కొందఱు ఆస్తికీని విద్యకును ఘనత గూర్చిరి: మరి కొందఱు అందమునకు ప్రాముఖ్య మిచ్చిరి. ఇంకొక కొందఱు ఆస్తిగల సాంప్రదాయమునకు గౌరవ మిచ్చిరి. కొందఱు సంబంధములను వెదకి చెప్పుటకు మాత్రమే పూనుకొనిరి. బాపనమ్మ ఆస్తి, అందము, విద్య, బాల్యము, సౌకుమార్యము, సౌజన్యము - ఇన్ని కోరెను. ఆ పెండ్లికొడుకు సోదరులలో కడపటి వాడును, తోబుట్టువులలో మధ్యవాడును, తల్లిదండ్రులకు ముద్దుబిడ్డడును గూడ కావలెనని యామె కోరెను.

చలపతి తీవ్రాలోచనమున ఒక సంవత్సరము గడచిపోయినది. మంచి సంబంధము కనబడలేదు. దారి తోచలేదు. పెళ్ళిచేయక తీరదు. ఏపని చేయుచున్నను ఇదియే ఆలోచన. రెండు మాసములకు ఆతడు ఒక దారి యేర్పరుచుకొనియెను. ఇది యైన ఉత్తర క్షణమునందే యాతడొక యువకుని దీసికొని సుభద్రకు చూపెను. ఆ బాలిక సౌందర్యమునకు ముగ్ధ యయ్యెను. "ఆస్తి సంగతి చెప్పండి. తక్కినవన్నీ నాకు నచ్చేయి" అని బాపనమ్మ చెప్పగా చలపతి "బీదతనం నాకు నచ్చింది" అనియెను.

బాపనమ్మ చకిత కాగా ఆతడు తన బోధనాశక్తి నంతను చూపెను. అతని వాగ్ధాటిలో విజయబీజము లున్నవి. బాపనమ్మ స్వాధీనయైనది. చలపతి వివాహ ప్రయత్నములు ప్రారంభించెను.

వరుడు శేషాచల మను యువకుడు. రాజమహేంద్రవరమున బియ్యే చదువుచున్నాడు. వయస్సు పదునెనిమిదేండ్లకు కొంచెము మించి యుండును. చామనచాయయే గాని స్ఫురద్రూపము. ఏడుగురు అన్నలకును నలుగురు అక్కలకును తమ్ముడు. ఇద్దఱు చెల్లెండ్రకు అన్న. జీవత్పితరుడు. సాంప్రదాయము గలవాడు. బలగము చాల పెద్దది. ఆస్తి మాత్రము లేదు. పసలపూడిలో తాటియాకుల యిల్లు మాత్రమున్నది. వారాల పద్ధతిలో జీవనము, చందాల పద్ధతిలో జీతము, గడచుచున్నవి. పుస్తకములు గూడ ఉచితముగ సంపాదించుకొనుచున్నాడు. మూడు పంచెలు, రెండు కండువాలు, నాలుగు కమీజులు, రెండు కోట్లు, ఒక పట్టుపంచె, దుప్పటీలు రెండు, అంగాస్త్రము

ఒకటి, గాజులాంపు ఒకటి, మామిడాడ చెంబు, దేవదారు పెట్టె, తుంగచాప, ఆకుచెప్పులు, అద్దము, దువ్వెన ఇది యాతని యాస్తి.

"నాయాస్తి అతనిది కాదూ?" అని చలపతి చెప్పగా మిత్రులు, బంధువులు - అందఱును తెల్లవోయిరి. ఎవరి యభ్యంతరమును కార్యకారి కాలేదు. చైత్రశుద్ధ పంచమినాడు రామచంద్రపురమున వివాహమయినది. దేవదుందుభులు మ్రోగినవి. ఉభయవ్యయములును చలపతియే భరించెను.

## 4

మామగారి యాజ్ఞ చొప్పున శేషాచలము మదరాసులో పచ్చయ్యప్ప కాలేజీలో సీనియరు తరగతి ప్రారంభించెను. దేనికిని లోపము లేదు. బుద్ధి ఆతని సొమ్మే. జయము గూడ నిశ్చితమే అయియుండెను.

తొలకరి కడచినది. వానలు ముదిరినవి. మదరాసు వీధులలో జలప్రవాహములు ప్రబలినవి. ఒకనాటి రాత్రి శేషాచలము వెన్నెలలో హోటలునకు వెళ్ళి వానలో మరలెను. గాలివాన యని చెప్పవచ్చును. మెఱుపు దీపములు నిస్తేజముగా నుండెను. తంబుశెట్టి వీధిలో ఆతని కేటి కెదురీత వలె నుండెను. ఇల్లు సమీపించినది. విలుప్తమయిన ధైర్యమునకు పుష్టి కలిగినది.

గుమ్మము ఎక్కుచుండగా మోకాలిలోతు నీటిలో యేదియో వచ్చి మీద ఎక్కెను. విదిలించుకొనగా చేతికి చుట్టబెట్టుకొనియెను. "పాము" అని కేకవేయునంతలో నాలుగు చోట్ల కఱచెను. ఒక్క అంగలో గుమ్మములో అడుగుపెట్టునప్పటికి అది క్రిందికురికి పారిపోయెను.

సహాధ్యాయులు, సహవాసులు అందఱును మూగిరి. టెలిఫోను చేయగా యిరువురు డాక్టరులు వచ్చిరి. రామచంద్రపురపు అర్జంటు టెలిగ్రాము రాగా చలపతి "డబ్బుకి వెనకతీయవద్దు" అని బదులు కొట్టెను.

అందఱును రాత్రియంతయు శ్రమపడిరి. సూర్యోదయసమయమున డాక్టరులు నిరాశ ప్రకటించి నిండిన జేబులతో వెడలిపోయిరి.

తొమ్మిదిగంటల ప్రొద్దెక్కిన తరువాత శేషాచలము ప్రాణములు విడిచెను. ద్వారపూడిలో పాసెంజరు అందుకొనుటకు మోటారులో కాలుపెట్టుచున్న చలపతికి మీరాసాహేబు చివర తంతి అందించి వెడలిపోయెను.

పూలలో పెరిగిన సుభద్ర తల్లిదండ్రులకు నేడు హృదయశల్య మయినది.

❀ ❀ ❀